## క్రికెట్ టోర్నీ విజేతగా 'బెల్లంపల్లి'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్

రామవరం, మే 12: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ సోమవారం జరిగాయి. కొత్తగూడెం రీజియన్, బెల్లంపల్లి రీజియన్ జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కొత్తగూడెం రీజియన్ జట్టు 20 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 129 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బెల్లంపల్లి రీజియన్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 130 పరుగులతో విజయం సాధించింది. ఇవే పోటీల్లో గత ఏడాది కూడా బెల్లంపల్లి రీజియన్ జట్టు గెలిచింది. విన్నర్-విన్నర్ జట్లకు బహుమతులను డైరెక్టర్ సత్యనారాయణరావు అందజేశారు. మహిళా ఎగ్జిక్యూటివ్ టీంలలో కొత్తగూడెం ఏరియా విన్నర్‌గా, బెల్లంపల్లి ఏరియా రన్నరప్‌గా నిలిచాయి. కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు, జీఎంలు మనోహర్, జీవీ కోటిరెడ్డి, పాలడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లెందు డిపోకు అదనపు బస్సులు



డిపోను పరిశీలిస్తున్న సాల్మన్‌రాజు

ఇల్లెందు, మే 12: ఆర్టీసీ ఇల్లెందు డిపోకు అదనంగా మరికొన్ని బస్సులు ఇస్తామని , సౌకర్యాలు కల్పిస్తామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్‌రాజు ప్రకటించారు. ఆయన సోమవారం ఇల్లెందు డిపోను తనిఖీ చేశారు. రికార్డులను, డిపో ఆవరణను పరిశీలించారు. డిపో అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఇల్లెందు నుంచి గుండాలకు, బోడుకు, కాళేశ్వరానికి బస్ సర్వీసులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయనను డిపో అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఖమ్మం ఆర్ఎం సరిరాం, డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

పాల్వంచ, మే 12: తమిళనాడు రాష్ట్రంలోని శ్రీపురం(వెల్లూరు)లోగల గోల్డెన్ టెంపుల్‌లో నారాయినీ పీఠం సాంస్కృతిక వేదికపై పాల్వంచ శ్రీ సంతోషిని నాట్య నిలయం విద్యార్థినులు ఇటీవల నృత్యం ప్రదర్శించారు. డ్యాన్స్ టీచర్ రమాదేవి నేతృత్వంలో 14 మంది నృత్య కళాకారులు ప్రహర్షిత, ప్రత్యూష, యోషిత, ధాత్రి, యశశ్విత, వర్షిణి, తన్మయ, లోకాక్షిత, కీర్తన, జశ్విత, మాన్విత, మీనాక్షి, చైత్రిక, సమత.. ఐదు నృత్యాలు ప్రదర్శించారు. నాట్యాచార్య దంపతులను నిర్వాహకులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నృత్య కళాకారులైన చిన్నారులకు స్వామి వారి ప్రసాదం, ప్రశంసాపత్రాలు అందించారు.

## పాల్వంచ టెన్నిస్ క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులు

పాల్వంచ, మే 12: ఈ నెల 11న జరిగిన బెజవాడ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ పాల్వంచ(ఏటీపీ) క్రీడాకారులు ప్రతిభ చాటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో 60 ప్లస్ విభాగంలో భాస్కర్ రావు, కబీర్‌దాస్; 30 ప్లస్ విభాగంలో సతీష్, కృష్ణ రన్నర్స్‌గా నిలిచారు. వీరిని టోర్నమెంట్ నిర్వాహకుడు రాజేందర్ ప్రసాద్ అభినందించారు.

## కాంగ్రెస్ కార్యకర్తను హత్య చేసిన మావోయిస్టులు

### ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 12: మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను దారుణంగా హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో సోమవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లింగపూర్ గ్రామంలో ఓ సామాజిక కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్త నాగ బండారి వెళ్లాడు. ఈ క్రమంలో సాయుధులుగా వచ్చిన మావోయిస్టులు గొడ్డలితో బంగారిని అతి దారుణంగా నరికి హత్య చేశారు. బండారి ప్రస్తుతం మరుడ్‌బాకా సొసైటీ సంచాలకుడిగా వ్యవహరిస్తున్నాడు. అయితే ఆరు నెలల క్రితం మావోయిస్టులు నాగ బండారి తమ్ముడైన తిరుపతి బండారిని సైతం అతి దారణంగా హత్య చేశారు. ఘటనపై స్పందించిన బీజాపూర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మావోయిస్టుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు.




# యథేచ్ఛగా మట్టి దందా

ఇసుక ర్యాంపులకు రోడ్లు వేయడానికి అక్రమంగా తరలింపు

మండలంలో కరిగిపోతున్న గుట్టలు, కూలిపోతున్న చెట్లు

ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నా పట్టించుకోని అధికారులు



కరకట్టపై ర్యాంపు నుంచి ఇసుకతో వాహనాలు



కరకట్టపై ర్యాంపు ఇసుక నిల్వలు

చర్ల, మే 12 : కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఇష్టారీతిన తవ్వకాలు చేపట్టడంతో మట్టి గుట్టలు సైతం కరిగిపోతున్నా పట్టించుకునే అధికారులు లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి తయారైంది. చర్ల మండలం శివలింగాపురం, ఆర్ కొత్తగూడెం సమీపంలోని అటవీ శాఖకు చెందిన భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన అక్రమార్కులు యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకున్నారు. దీనిని గుర్తించిన చర్ల రేంజర్ ద్వాలియా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి వాహనాలను సైతం సీజ్ చేశారు. అనంతరం తమ వాహనాలను జరిమానా కట్టి యజమానులు వాటిని తీసుకెళ్లారు. అలాగే కలివేరు సమీపంలోని మరో గుట్ట వద్ద ఇసుక ర్యాంపుల కోసం రోడ్లు వేయడానికి గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావు అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయించారు. దీంతో అక్రమార్కుల కన్ను దోసిళ్లపల్లిలోని లెనిన్ కాలనీ సమీపంలోని మరో గుట్టపై పడింది. పోలీస్ గ్రౌండ్ కోసం కేటాయించిన భూమిలో వారం రోజులుగా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను నిలుపుదల చేయించి, గుట్టలు కరిగిపోకుండా కాపాడాలని కోరుతున్నారు.

### కరుగుతున్న గుట్టలు, కూలుతున్న వృక్షాలు!

గ్రావెల్, మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా చేపట్టడంతో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుట్టలు కనుమరుగవుతున్నాయి. ఆయా గుట్టపై ఏళ్లతరబడి పెరిగిన మహా వృక్షాలు సైతం నేలకూలుతున్నాయి. ఒకప్పుడు కలప, ఇతర అవసరాల కోసం స్మగ్లర్లు అడవులను ధ్వంసం చేశారు. ఇప్పుడు ఇసుక ర్యాంపులకు రోడ్డు వేసేందుకు అక్రమార్కులు గుట్టలను తవ్వుతూ కరగదీస్తున్నారు. గుట్టల చుట్టూ ఉన్న అడవులు సైతం పలచబడి ఎడారులను తలపిస్తున్నాయి. దీనిపై మైనింగ్ శాఖ అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

### ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు

కుదునూరు వద్ద మంజూరైన ఇసుక ర్యాంపుపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. ర్యాంపు నిర్వాహకులు కరకట్టపైనే ఇసుకను డంపు చేస్తున్నారు. ఇసుకను కరకట్టపై డంపు చేసేందుకు తాము ఎవరికి అనుమతులు ఇవ్వలేదు. దీని గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

– నీటిపారుదల శాఖ డీఈఈ తిరుపతి

## ఎదురుకాల్పుల్లో 25 మంది మావోయిస్టులు మృతి?

### ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

### ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధ, సామగ్రి స్వాధీనం

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 12: భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర పోరులో 25 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దుల్లో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్ర రాష్ట్రం గడ్చిరోలి జిల్లా భామ్రగఢ్ దళానికి చెందిన మావోయిస్టులు కన్వాడే పోలీస్‌స్టేషన్ పరిధి ఫుట్ ఓవర్‌బ్రిడ్జ్ వద్ద క్యాంపు నిర్వహించినట్లు పోలీస్ వర్గాలకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అదనపు ఎస్పీ ఎం.రమేశ్ నేతృత్వంలో సుమారు 200 మంది సీ-60 భద్రతా దళాలు ఆదివారం రాత్రి నుంచి ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య విడతల వారీగా భీకర కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఘటనా స్థలం నుంచి ఒక ఇన్‌సాస్ రైఫిల్, ఒక సింగిల్ షాట్ రైఫిల్, ఒక మ్యాగజైన్, లైవ్ రౌండ్లు, డిటోనేటర్లు, ఒక రేడియోతోపాటు పెద్ద ఎత్తున మావోయిస్టులకు సంబంధించిన ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక ఆ ప్రాంతంలోని మావోయిస్టుల స్థావరాలను బలగాలు ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో సుమారు 25 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల వివరాలను అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది.

## నర్స్.. అమ్మకు ప్రతిరూపం



అశ్వారావుపేట: కేక్ కట్ చేస్తున్న రాధారుక్మిణి

అశ్వారావుపేట, మే 12: రోగులపట్ల అత్యంత ప్రేమాభినామాలతో సేవలు అందించే నర్సులు అమ్మలకు ప్రతిరూపమని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధారుక్మిణి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో సోమవారం కేక్ కట్ చేశారు.

టేకులపల్లి, మే 12: మండలంలోని సులానగర్ పీహెచ్‌సీలో హెడ్ నర్స్ జగదాంబ కేక్ కట్ చేశారు. నర్సులను పీహెచ్‌సీ సిబ్బంది సన్మానించారు. డాక్టర్ కంచర్ల వెంకటేష్, నర్సులు-సిబ్బంది వజ్జా పార్వతి, విజయ, శ్రీనివాస్, రవికుమార్, కిరణ్‌కుమారి, రాజు, శ్రీనివాస్, నాగలక్ష్మి, కమల, రమాకుమారి, సుజాత, కళావతి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్, మే 12: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న పలు సీసీ రోడ్లు, డ్రైనేజీలకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ ఈఈ సత్య, డీఈఈ శ్రీనివాసరావు, నాయకులు పిరినకి నవీన్, తరుణ్‌రెడ్డి, సతీష్, శివ సైదులు పాల్గొన్నారు.

## సైనిక అమరవీరులకు జోహార్లు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అశ్వాపురం, మే 12: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన భారత సైనిక అమర వీరులకు జోహార్లు అర్పిస్తూ సేవాలాల్ సేన మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో ప్లెక్సీలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలిపారు. ఈ ర్యాలీలో సేవాలాల్ మండల అధ్యక్షుడు భూక్యా నరసింహనాయక్, సేవాలాల్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు కాల్వ సంసోన్, మేకల భాస్కర్, వర్తక సంఘం నేతలు పాల్గొన్నారు.

## సావిత్రి కుటుంబానికి పరామర్శ

బూర్గంపహాడ్, మే 12: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామానికి చెందిన మాదిరెడ్డి నాగిరెడ్డి సతీమణి మాదిరెడ్డి సావిత్రి అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు సోమవారం సావిత్రి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు విజయలక్ష్మి, ఆవుల మహేష్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 12: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## కార్పొరేట్ ఆస్పత్రులపై యాజమాన్యం దృష్టి సారించాలి : నాగెల్లి



మణుగూరు టౌన్, మే 12: కంపెనీ రిఫరల్ ద్వారా వెళ్లిన కార్మికులకు అదనపు చార్జీలు వడ్డించి కార్మికుల నడ్డి విరుస్తున్న కార్పొరేట్ ఆస్పత్రులను గుర్తించి చర్యలు చేపట్టాలని మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర ప్రగతి కోసం ప్రాణాలకు తెగించి కష్టించి పనిచేస్తున్న సింగరేణి కార్మి కుల శ్రమను కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల శక్తులు అదనపు చార్జీల పేరిట జలగల్లా పట్టి పీడిస్తున్నాయని అన్నారు. అటువంటి హాస్పిటల్‌పై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

## అధికారుల నిర్లక్ష్యంతో మంచినీటి ఎద్దడి




మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు

దుమ్ముగూడెం, మే 12: మండలంలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతోనే మంచినీటి ఎద్దడి నెలకొన్నదని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు విమర్శించారు. సోమవారం మండల కేంద్రమైన లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల పార్టీ కో-కన్వీనర్ ఎండీ జానీపాషాతో కలిసి ఆయన మాట్లాడారు. పర్ణశాల పంపుహౌస్ వద్ద నీటి నిల్వలకు చేపట్టాల్సిన పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. మంచినీటి ఎద్దడికి మండలంలో చేపట్టాల్సిన చర్యల్లో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని, వేసవిలో ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, తక్షణమే మంచినీటి సమస్యను నివారించి మండలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారుల తీరుపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి మండల ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా నిరంతరం సరఫరా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, పార్టీ నాయకులు దామెర్ల శ్రీనివాస్, వాగే వెంకటేశ్వరరావు, భూక్యా చందు, తంతరపల్లి వెంకటేశ్వరరావు, కిట్టు, సూర్య, లక్ష్మణరావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాల్గవ తరగతి ఉద్యోగుల కమిటీ ఎన్నిక



నాల్గవ తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గం

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 12: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని కొత్తగూడెంలో సోమవారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా కంభంపాటి రమణ, సహాధ్యక్షుడిగా హరిబాబు, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, నవీన్, కార్యదర్శిగా దినేష్, సంయుక్త కార్యదర్శులుగా ధనలక్ష్మి, కృష్ణ, కోశాధికారిగా నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుధాకర్, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్, ఆఫీస్ కార్యదర్శిగా డి.రాము తదితరులు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు లునావత్ దాస్య నాయక్, ప్రధాన కార్యదర్శి ఖాదర్ బిన్ హాసన్, సహాధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి కృష్ణవేణి, కోశాధికారి ధన్‌రాజ్ పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### సాయి మందిరానికి లక్ష విరాళం

భద్రాచలం, మే 12: పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లో ఉన్న సాయిబాబా మందిరానికి సోమవారం దాత బోడపాటి వల్లభరావు తన కుమార్తెతో కలిసి రూ.లక్ష బోడపాటి అప్పాకృష్ణ వెంకటేశ్వర్ పేరుతో శాశ్వత అన్నదానం నిమిత్తం ఆలయ ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆకెళ్ల శ్రీరామ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గురుకులంలో స్పాట్ కౌన్సిలింగ్

భద్రాచలం, మే 12: గురుకులం జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్పాట్ కౌన్సిలింగ్ ప్రవేశం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 15న ఉదయం 9 గంటలకు బాలికలు, 16న బాలురకు స్పాట్ కౌన్సిలింగ్ భద్రాచలంలో ఉంటుందని తెలిపారు. వివరాలకు 9490957271, 9490957270లను సంప్రదించాలని పీవో పేర్కొన్నారు.

### తంబోలా ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు

కరకగూడెం, మే 12: మండల కేంద్రంలోని మసీదు సమీపంలో కొంత మంది వ్యక్తులు డబ్బులు పెట్టి తంబోలా ఆడుతున్నారన్న సమాచారంతో సోమవారం ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెంకటేశ్వర్లు, సతీష్, హేమంత్, షేక్ అనీఫ్, షేక్ రియాజ్‌ని అదుపులోకి తీసుకోగా.. పఠాన్, షేక్ షారుక్, జలీల్, నరేష్‌తో పాటు మరి కొంత మంది పారిపోయినట్లు ఎస్ఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల వద్ద నుంచి 5 సెల్‌ఫోన్లు, ఒక బైక్, రూ.1500 స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బూర్గంపహాడ్, మే 12: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను బూర్గంపహాడ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై నాగభిక్షం, సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా మండల పరిధిలోని సంజీవరెడ్డిపాలెం సెంటర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లు వల్లెపు అనిల్‌కుమార్, బత్తుల మణికంఠపై కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని లక్ష్మీపురం సెంటర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను ఎస్సై రాజేష్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ సాయిరాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.

### నేడు 'యువ వికాసం' ఇంటర్వ్యూ

ఇల్లెందు, మే 12: ఇల్లెందు మున్సిపల్ పరిధిలోని రాజీవ్ యువ వికాసం పథకం బీసీ దరఖాస్తుదారులకు మెప్మా కార్యాలయంలో ఎస్‌బీఐ అధికారులు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తారని కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 273 క్రమ సంఖ్య వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 273 నుంచి 673 క్రమ సంఖ్య వరకు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందని వివరించారు.

### ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కొత్త కోర్సులు

ఇల్లెందు రూరల్, మే 12: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్త కోర్సులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీఏలో కంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్స్, బీకాంలో ఈ-కామర్స్ ఆపరేషన్స్ మంజూరైనట్లు వివరించారు.

### ఎస్‌సీసీడబ్ల్యూయూ సహాయ కార్యదర్శిగా గౌని

కొత్తగూడెం అర్బన్, మే 12: సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీడబ్ల్యూయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గౌని నాగేశ్వరరావును భూపాలపల్లిలో జరిగిన రెండు యూనియన్ల విలీన సభ ఎన్నుకుంది. అధ్యక్ష, కార్యదర్శులుగా రాసుద్దీన్, వెంకన్న ఎన్నికయ్యారు.

### సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ములకలపల్లి, మే 12: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండుతో ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు అన్నవరపు కనకయ్య కోరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. నాయకులు ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, గౌరీ నాగేశ్వరరావు, మాలోత్ రావుజా, నిమ్మల మధు, పాయం అమల పాల్గొన్నారు.

### నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు

పాల్వంచ రూరల్, మే 12: నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆయన సోమవారం సొసైటీ కార్యాలయంలో పాలక వర్గ సమావేశంలో మాట్లాడారు. కేంద్రానికి వచ్చిన ప్రతీ గింజను కొంటామన్నారు. డైరెక్టర్లు నారాయణరావు, పాపారావు, కిషన్, సీఈవో లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

టేకులపల్లి, మే 12: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ప్రెగళ్లపాడు గ్రామస్తులు 12 మందిని ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పరామర్శించారు. రూ.20వేలు సాయం అందించారు.

### వేసవి దుక్కులతో చీడపీడలు దూరం

అశ్వారావుపేట రూరల్, మే 12: వేసవి దుక్కులతో చీడపీడలను నివారించవచ్చని స్థానిక వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఐవీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. మండలంలోని నారంవారిగూడెం పంచాయతీ కార్యాలయంలో సోమవారం 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేతలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణ్ కుమార్, ఏవో శివరాం ప్రసాద్, ఏఈవోలు సతీష్, షాకీరాభాను, పశుసంవర్ధక శాఖ అధికారి మదార్‌భక్షి పాల్గొన్నారు.

### ఉత్తమ విద్యార్థులకు సన్మానం

అశ్వారావుపేట టౌన్, మే 12: పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన జుజ్జరపు మోక్షితబాబును, తగరం తెరిషను విశ్రాంత ఉద్యోగులు జుజ్జరపు శ్రీరామ్మూర్తి, బడిపాటి సత్యనారాయణ సోమవారం సన్మానించారు. తదుపరి చదువుల్లోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

### ముగ్గురిపై కట్నం వేధింపుల కేసు

పాల్వంచ రూరల్, మే 12: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారన్న ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కేశవాపురం గ్రామస్తురాలు మోతుకూరి మాధవికి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన రమణాచారితో 2014లో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. అదనపు కట్నం తేవాలంటూ కొంత కాలగా మాధవిని ఆమె భర్త, అత్త, మామ వేధిస్తున్నారు. దీనిని భరించలేని ఆమె వారం కిందట కేశవాపురంలోని పుట్టింటికి వచ్చింది. రూరల్ పోలీస్ స్టేషన్‌లో భర్త రమణాచారి, అత్త అనసూయ, మామ వెంకటేశ్వర్లుపై సోమవారం ఫిర్యాదు చేసింది. ఆ ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.